నమస్తే తెలంగాణ
యాదాద్రి భువనగిరి
I | హైదరాబాద్, శుక్రవారం 31 మే 2024 | YADADRI BHUVANAGIRI

జిల్లా ఫాస్ట్‌ట్రాక్ సెషన్స్ కోర్టులో ఉద్యోగాలకు దరఖాస్తులు

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి నాగరాజు

రామగిరి, మే 30 : నల్లగొండ జిల్లా ఫాస్ట్‌ట్రాక్ సెషన్స్ కోర్టులోని కేసులను త్వరగా పరిష్కరించేందుకు 2 సంవత్సరాలు కాంట్రాక్టు పద్ధతిపై సీనియర్ అసిస్టెంట్, స్టెనోగ్రాఫర్ గ్రేడ్ – 3, టైపిస్ట్, డ్రైవర్, ఆఫీస్ సబార్డినేట్ పోస్టులకు విశ్రాంత జ్యూడీషియల్ ఉద్యోగులు, ఇతర అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ జడ్జి నాగరాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు దరఖాస్తులను జూన్ 7న సాయంత్రం 5గంటల్లోగా ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి నల్లగొండ పేరు మీదుగా సీల్డ్ కవర్‌లో లేదా కొరియర్ ద్వారా పంపించవచ్చని పేర్కొన్నారు. అభ్యర్థులు దరఖాస్తుతోపాటు వారి విద్యార్హతలకు సంబంధించిన సర్టిఫికెట్లు, జనన, కులం ధ్రువీకరణ పత్రాలు, ఎంప్లాయ్‌మెంట్ రిజిస్ట్రేషన్ కార్డు, లోకల్ నాన్ లోకల్ సర్టిఫికెట్, సొంత చిరునామా వివరాలతో తిరిగి రిజిస్టర్ పోస్టు చేసేలా 30 రూపాయల స్టాంపులు అతికించిన కవర్‌ను జత చేసి పంపించాలని సూచించారు. జూన్ 7 తర్వాత వచ్చిన దరఖాస్తులను అనుమతించబోమని స్పష్టం చేశారు.

ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం తగదు

- నల్లగొండ జడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశంలో జిల్లా పరిషత్ చైర్మన్ నరేందర్‌రెడ్డి

మాట్లాడుతున్న జడ్పీ చైర్మన్ నరేందర్‌రెడ్డి

స్టాండింగ్ కమిటీ సమావేశానికి హాజరైన ప్రజాప్రతినిధులు, అధికారులు

నీలగిరి, మే 30 : ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని జడ్పీ చైర్మన్ బండ నరేందర్‌రెడ్డి అన్నారు. జిల్లా పరిషత్ సమావేశంలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు సరైన సమాధానం ఇవ్వకపోవడంతోపాటు గైర్హాజరైన అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లా పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో గురువారం జడ్పీ ఒకటవ, రెండవ, మూడు, నాలుగు, ఏడవ స్థాయీసంఘాల సమావేశాలు చైర్మన్ బండ నరేందర్‌రెడ్డి, వైస్ చైర్మన్ ఇరిగి పెద్దులు అధ్యక్షతన వేర్వేరుగా జరిగాయి. ఈ సమావేశాల్లో పంచాయతీరాజ్, ఆర్ అండ్ బీ, విద్య, వైద్యం, ఉద్యానవన, వ్యవసాయ, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ, ఖాదీ రుణాలతోపాటు ఆయా శాఖల అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అభివృద్ధి పనులు చేపట్టడంలో అధికారుల నిర్లక్ష్యాన్ని సభ్యులు ఎండగట్టారు. పెండింగ్ బిల్లుల మంజూరు, అభివృద్ధి పనులు పూర్తి చేయకపోవడంపై అధికారులను ప్రశ్నించారు. దీనిపై అధికారుల నుంచి సరైన సమాధానాలు రాకపోవడంతో జడ్పీ చైర్మన్ వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశానికి గైర్హాజరైన వివిధ శాఖల అధికారులపై అసహనం వ్యక్తం చేశారు. సమస్యల పరిష్కారంలో అధికారుల నిర్లక్ష్యం సరికాదన్నారు. ఇప్పటికైనా పనులను త్వరగా పూర్తి చేసి పెండింగ్ బిల్లులను తక్షణమే చెల్లించాలని అధికారులకు సూచించారు. సమావేశాల్లో ఎమ్మెల్సీ నర్సిరెడ్డి, జడ్పీ సీఈఓ ఎన్.ప్రేమ్‌కరణ్‌రెడ్డి, జడ్పీటీసీలు వెంకటేశ్వర్‌రెడ్డి, చిట్ల వెంకటేశం, స్వర్ణలత, లలిత, సరిత, సూర్య భాషానాయక్, జడ్పీటీసీ వంగూరి లక్ష్మయ్య, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వ్యవసాయ, పోలీసు అధికారుల సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హనుమంతు కె.జెండగే

ఎరువులు, విత్తనాల కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు

- కలెక్టర్ హనుమంతు కె.జెండగే

భువనగిరి కలెక్టరేట్, మే 30 : విత్తనాలు, ఎరువుల కృత్రిమ కొరత సృష్టించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ హనుమంతు కె.జెండగే హెచ్చరించారు. వ్యవసాయ, పోలీసు అధికారులతో గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వానకాలం సీజన్‌లో రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందేలా విత్తన చట్టాన్ని పకడ్బందీగా అమలు చేసేందుకు వ్యవసాయ, పోలీసు శాఖల ఆధ్వర్యంలో నాలుగు విత్తన స్క్వాడ్ బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నాణ్యమైన విత్తనాల సరఫరా కోసం స్క్వాడ్ బృందాలు షాపుల్లో తనిఖీలు నిర్వహిస్తాయని, స్టాక్ రసీదులు పరిశీలిస్తాయని చెప్పారు. అక్రమాలకు పాల్పడితే విత్తన చట్టం 1966 ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని, అవసరమైతే పీడీ యాక్ట్ నమోదు చేయాలని ఆదేశించారు. విత్తన, ఎరువుల గోదాములు, షాపులను తనిఖీ చేయాలని, సీడ్ లైసెన్స్‌లు, నేమ్ బోర్డులు, స్టాక్ బోర్డులు, ధరల పట్టిక, బిల్లులు, డెలివరీ చలాన్లు, ఇన్‌వాయిస్‌లను పరిశీలించాలని, బుక్ బ్యాలెన్స్‌తో స్టాక్‌కు పరిశీలించాలని సూచించారు. తనిఖీ సమయంలో గడువు ముగిసిన విత్తన స్టాక్ ఏమైనా ఉందా? అని పరిశీలించాలన్నారు. ఎమ్మార్పీ కంటే ఎక్కువకు విక్రయించడం వంటి చట్ట విరుద్ధ కార్యకలాపాలను నియంత్రించాలని, రైతుల నుంచి ఫిర్యాదులు అందిన వెంటనే చర్యలు తీసుకోవాలని సూచించారు. వ్యవసాయ అధికారులు, విస్తరణ అధికారులు క్షేత్రస్థాయిలో రైతులకు నకిలీ విత్తనాలతో కలిగే నష్టాలు, మేలు రకం విత్తనాల ద్వారా వచ్చే లాభాలను వివరించాలని సూచించారు. విత్తనాలు సరిపడా అతందుబాటులో ఉన్నాయని, రైతులు బ్రాండెడ్ విత్తనాలను కొనాలని, తప్పనిసరిగా బిల్లులు తీసుకొని దగ్గర ఉంచుకోవాలని అన్నారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ పి.బెన్ షాలోమ్, డీఏఓ అనూరాధ, వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్లు దేవీసింగ్, పద్మావతి, వెంకటేశ్వర్లు, నీలిమ, వ్యవసాయ, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

రాష్ట్ర ఆవిర్భావ వేడుకలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకలకు ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ హనుమంతు కె.జెండగే అధికారులకు సూచించారు. రాష్ట్ర ఆవిర్భావ వేడుకల ఏర్పాట్లపై కలెక్టర్ కార్యాలయ కాన్ఫరెన్స్ హాల్‌లో అన్ని శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. జూన్ 2న ఉదయం 9గంటలకు కలెక్టరేట్‌లో జాతీయ పతాకావిష్కరణ ఉంటుందని, అంతకుముందు భువనగిరిలోని అమరవీరుల స్థూపం వద్ద అమరవీరులకు నివాళి అర్పించడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమాలకు సంబంధించిన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు.

ఆపదలో పేదింటి బిడ్డ

- బ్రెయిన్‌లో బ్లడ్ క్లాట్
- అపస్మారక స్థితిలో మహేశ్
- ఆపన్న హస్తం కోసం ఎదురుచూపులు
- వైద్యం చేయించేందుకు ఆర్థిక సాయం కోసం వృద్ధాప్యంలో ఉన్న తల్లి వేడుకోలు

అపస్మారక స్థితిలో ఉన్న మహేశ్

రాజాపేట, మే 30 : రెక్కాడితే గానీ డొక్కాడని పేద కుటుంబానికి చెందిన యువకుడికి బ్రెయిన్‌లో రక్తం గడ్డ కట్టింది. దాంతో ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్నాడు. దాంతో వైద్యం చేయించుకునేందుకు డబ్బులు లేక ఆర్థిక సాయం కోసం ఎదురుచూస్తున్నాడు. రాజాపేట మండల కేంద్రానికి చెందిన దొంతి మహేశ్(21)కు తండ్రి లేడు. తల్లి వృద్ధురాలు. మహేశ్ పని చేస్తేనే కుటుంబం గడిచే పరిస్థితి. ఉండేందుకు ఇల్లు కూడా సరిగా లేదు. చిన్న పెంకుటింట్లో నివాసం ఉంటున్నాడు. ఉన్న ఊరిలోనే డీజే సౌండ్ సిస్టమ్‌లో పనిచేస్తూ వృద్ధురాలైన తల్లితో కలిసి కుటుంబాన్ని నెట్టుకొస్తున్నాడు. కాగా, నాలుగు రోజుల క్రితం ఉదయం లేచి రోజులాగే పనికి వెళ్తున్న క్రమంలో ఒక్కసారిగా కుప్పకూలి పడిపోయి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. చుట్టుపక్కల వారి సహకారంతో వృద్ధురాలైన తల్లి తన కొడుకును చికిత్స నిమిత్తం ప్రభుత్వ దవాఖానకు తీసుకెళ్లింది. పరిస్థితి విషమంగా ఉందని డాక్టర్లు చెప్పడంతో గజ్వేల్ నియోజకవర్గంలో ఆర్‌వీఎం దవాఖానకు తరలించారు. డాక్టర్లు వైద్య పరీక్షలు చేసిన అనంతరం బ్రెయిన్‌లో రక్తం గడ్డకట్టిందని, వైద్య కోసం రూ.5 లక్షలు ఖర్చవుతాయని తెలిపారు. ఆర్థిక ఇబ్బందులతో కుటుంబమే గడవడం కష్టంగా ఉండగా, వైద్యం కోసం ఇంత డబ్బు ఎక్కడ తేవాలని ఆ వృద్ధ తల్లి తల్లడిల్లిపోతున్నది. ఆ తల్లి ప్రతి ఒక్కరి కాళ్లపై పడి ప్రాధేయపడుతున్న తీరు వర్ణణాతీతం. పేద కుటుంబానికి చెందిన యువకుడు మహేశ్‌కు వైద్య పరీక్షల కోసం చేయూత ఇవ్వాలని గ్రామస్తులు సైతం కోరుతున్నారు. పేదోడి వైద్యం కోసం తమకు తోచినంత సాయాన్ని గూగుల్ పే, ఫోన్ పే ద్వారా 9133109593 నంబర్‌కు పంపించి తన కొడుకును కాపాడాలని ఆ వృద్ధ తల్లి లచ్చవ్వ వేడుకుంటున్నది.

దంచికొడుతున్న ఎండలు

- జిల్లాలో 45.6 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు

భువనగిరి కలెక్టరేట్, మే 30 : ఎండల తీవ్రత రోజురోజుకూ పెరుగుతుంది. జిల్లాలో గురువారం 45.6 డిగ్రీల అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. పెరుగుతున్న ఎండ తీవ్రతను తట్టుకోలేక ప్రజలు ప్రయాణాలను మానుకుంటున్నారు. దాంతో రహదారులు నిర్మానుష్యంగా మారుతున్నాయి. జిల్లాలో యాదగిరిగుట్టలో అత్యధికంగా 45.6 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. వలిగొండ మండలంలో 44.8 డిగ్రీలు, ఆలేరు మండలం గొలనుకొండలో 44, మోత్కూరు మండలం బుజిలాపురంలో 43.7డిగ్రీలు, బీబీనగర్‌లో 43.3, గుండాలలో 43, ఆత్మకూరు (ఎం)లో 42.8, అడ్డగూడూరులో 42.7, భువనగిరి మండలం నందనంలో 42.7, భూదాన్ పోచంపల్లి మండలం జలాల్‌పురంలో 42.5, సంస్థాన్ నారాయణపురం మండలం జనగాంలో 42.5, చౌటుప్పల్ మండలం తూప్రాన్‌పేటలో 42.5, రాజాపేటలో 42.4, బొమ్మలరామారంలో 42.2, మోటకొండూరు, తుర్కపలి మండలాల్లో 42, రామన్నపేట మండలంలో 41.7డిగ్రీలు నమోదైనట్లు అధికారులు తెలిపారు.

మేళ్లచెర్వులో @ 45.6 డిగ్రీలు

మేళ్లచెర్వు, మే 31 : మండలంలో రికార్డు స్థాయి ఉష్ణోగ్రత నమోదైంది. గతంలో ఎన్నడూ లేని విధంగా గురువారం మధ్యాహ్నం 3గంటలకు 45.6 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. సూర్యాపేట జిల్లాలో అత్యధిక ఉష్ణోగ్రతల్లో 45.6 డిగ్రీలతో మేళ్లచెర్వు మొదటి స్థానంలో ఉండగా.. 45.5 డిగ్రీలతో రెండో స్థానంలో పెన్‌పహాడ్, 45.3 డిగ్రీలతో హుజూర్‌నగర్ మూడో స్థానంలో నిలిచాయి. అసలే రోహిణి కార్తె కావడంతో ఉష్ణోగ్రతలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. దీంతో ప్రజలు ఎండ వేడిమిని తట్టుకోలేక నానా అవస్థలు పడుతున్నారు. మేళ్లచెర్వులో ఇప్పటి వరకు 45.6 డిగ్రీలు నమోదు కావడం ఇదే తొలిసారి.


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హనుమంతు కె.జెండగే

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరిగేలా చూడాలి

- జూన్ 3నుంచి 19వరకు బడిబాట కార్యక్రమం నిర్వహించాలి
- కలెక్టర్ హనుమంతు కె.జెండగే

భువనగిరి కలెక్టరేట్, మే 30 : బడిబాట కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరిగేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ హనుమంతు కె.జెండగే అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో బడిబాట కార్యక్రమంపై గురువారం ఏర్పాటు చేసిన వివిధ శాఖల సమన్వయ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. జూన్ 3నుంచి 19వరకు జరిగే బడిబాట కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ప్రవేశాలు పెరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. రైట్ టు ఎడ్యుకేషన్ (ఆర్‌టీఈ) విద్యా హక్కులో భాగంగా 6 సంవత్సరాల నుంచి 14 ఏండ్ల పిల్లలు తప్పనిసరిగా బడికి వెళ్లాలన్నారు. అందుకోసం గ్రామాలు, ఆవాసాల్లో పిల్లలను గుర్తించి దగ్గరలోని ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని సూచించారు. ప్రభుత్వ బడుల్లో కల్పిస్తున్న వసతులు, పథకాలు, నాణ్యమైన విద్య గురించి తల్లిదండ్రులు, కమ్యూనిటీ పెద్దలకు వివరించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు వెళ్లే పిల్లలు, బడి మానేసిన విద్యార్థులను తిరిగి పాఠశాలల్లో చేర్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. శుక్రవారం మండల స్థాయి కమిటీలు సమావేశమై క్షేత్రస్థాయిలో బడి బాట కార్యక్రమాలను విజయవంతం అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆశ, అంగన్‌వాడీ, స్వయం సహాయక మహిళా సమాఖ్యల సమన్వయంతో ఇంటింటి ప్రచారం చేపట్టాలని ఆదేశించారు. బడి బాట కార్యక్రమంలో భాగంగా రోజూ ఉదయం 7నుంచి 11 గంటల వరకు క్షేత్రస్థాయిలో పర్యటించాలన్నారు. జూన్ 3న గ్రామ స్థాయి డ్రైవ్ చేపట్టి స్వయం సహాయక సంఘాలు, అమ్మ ఆదర్శ కమిటీ సభ్యులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, పూర్వ విద్యార్థులతో ప్రమాణాలు, ర్యాలీలు నిర్వహించాలని తెలిపారు. 4న ప్రతి ఇంటికీ వెళ్లి బడి ఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. స్కూళ్లకు వెళ్లే విద్యార్థుల వివరాలను విలేజ్ ఎడ్యుకేషన్ రిజిస్టర్‌లో నమోదు చేయాలని పేర్కొన్నారు. 5నుంచి 10వ తేదీ వరకు అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి విద్యార్థుల పేర్లు నమోదు చేయించాలని, 11న గ్రామ సభ ఏర్పాటు చేయాలని సూచించారు. 12న విద్యార్థులకు స్వాగత దినోత్సవం ఏర్పాటు చేసి పాఠశాలలను అందంగా అలంకరించాలని, రంగోలి తదితర ఉత్సాహ కార్యక్రమాలు రూపొందించాలని అన్నారు. అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా పాఠశాలల్లో చేపట్టిన వసతులను వివరించాలని, తల్లిదండ్రులు, ప్రజాప్రతినిధులు, కమ్యూనిటీ పెద్దలతో పేరెంట్, టీచర్ మీటింగ్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. చేపట్టిన పనులను ప్రారంభించాలని, విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, డ్రెస్సులు అందజేయాలన్నారు. గత విద్యా సంవత్సరం ప్రతిభ కనబరిచిన, మంచి హాజరు కలిగిన విద్యార్థులను అభినందించడంతో పాటు వారి తల్లిదండ్రులను సన్మానించాలని తెలిపారు. 13న విద్యార్థులు తయారు చేసిన విద్యా ప్రమాణాలకు సంబంధించి పోస్టర్లు, చార్ట్‌లను ప్రదర్శించి తరగతి గదులను డెకరేట్ చేయాలన్నారు. 14న సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించి అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల సభ్యులు, తల్లిదండ్రులు, ప్రజాప్రతినిధులను భాగస్వామ్యం చేయాలని సూచించారు. ఉన్నత పాఠశాలలకు సంబంధించి విద్య ప్రాముఖ్యత, ప్రభుత్వ పాఠశాలల్లో అందిస్తున్న సౌకర్యాలపై విద్యార్థులతో సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించాలని, 15న సహిత విద్య, బాలికల విద్యా దినోత్సవం జరుపుకోవాలని అన్నారు.

ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలను భవిత కేంద్రాలు, పాఠశాలల్లో చేర్పించాలని సూచించారు. గ్రామాలు, ఆవాసాలలో బాల కార్మికులు లేకుండా చూడాలని, గుర్తించిన వారందరినీ పాఠశాలల్లో చేర్పించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. 18న డిజిటల్ తరగతులపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, తరగతి వారీగా విద్యార్థులతో మొక్కలు నాటే కార్యక్రమాలు చేపట్టాలని, మొక్కలు పెంచే బాధ్యతను వారికే అప్పగించాలని సూచించారు. ఇంటింటా చదువుల పంట యాప్ గురించి విద్యార్థుల తల్లిదండ్రులకు తెలియజెప్పాలన్నారు. 19న క్రీడా దినం ఏర్పాటు చేసి విద్యార్థులకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, ఫుట్‌బాల్ వంటి ఆటల పోటీలు నిర్వహించాలని ఆదేశించారు. బడిబాట కార్యక్రమం లక్ష్యం నెరవేరేందుకు సంబంధిత శాఖలు కృషి చేయాలన్నారు. సమావేశంలో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ కె.గంగాధర్, భువనగిరి ఆర్డీఓ అమరేందర్, డీఆర్డీఓ ఎంఏ కృష్ణన్, డీఈఓ కె.నారాయణరెడ్డి, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

కారును ఢీకొట్టిన కంటైనర్.. ముగ్గురికి గాయాలు

అనంతారం ఫ్లైఓవర్‌పై పల్టీ కొట్టిన కారు

భువనగిరి కలెక్టరేట్, మే 30 : కంటైనర్ కారును వెనుక నుంచి ఢీకొట్టడంతో కారు పల్టీ పట్టగా కారులో ప్రయాణిస్తున్న ముగ్గురికి గాయాలైన సంఘటన మండలంలోని అనంతారం ఫ్లైఓవర్ బ్రిడ్జిపై గురువారం చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు, రోడ్ సేఫ్టీ బృందం తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ నుంచి భువనగిరి వైపునకు వస్తున్న కారు(టీఎస్ 09ఎఫ్‌వీ 5511)ను కంటైనర్(ఆర్‌జే11జీసీ 2621)అతివేగంగా ఢీకొట్టింది. దాంతో కారు ఫ్లైఓవర్‌పై పల్టీలు కొట్టింది. ఈ క్రమంలో కారులో ప్రయాణిస్తున్న పడాల అక్షిత్, ఎస్.స్వామి, మల్లేశ్‌కు గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న రోడ్ సేఫ్టీ బృందం ఆధ్వర్యంలో కారు, కంటైనర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు రూరల్ ఎస్ఐ సంతోష్‌కుమార్ తెలిపారు.

జిల్లా ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్‌పై లైంగిక వేధింపుల కేసు

- మహిళా డాక్టర్ ఫిర్యాదు.. పరారీలో డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి

సూర్యాపేట సిటీ, మే 30 : సూర్యాపేట జిల్లా ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్, అసంక్రమిత వ్యాధుల నియంత్రణ జిల్లా అధికారి డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తిపై లైంగిక వేధింపుల కేసు నమోదైంది. సూర్యాపేట పట్టణానికి చెందిన ఓ మహిళా డాక్టర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయగా.. ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లా ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్, అసంక్రమిత వ్యాధుల నియంత్రణ జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్‌గా వయోవృద్ధుల సంక్షేమం కోసం ఏర్పాటు చేసిన ఆలన విభాగానికి ప్రోగ్రాం ఆఫీసర్‌గా డాక్టర్ కళ్యాణ్‌చక్రవర్తి పని చేస్తున్నారు. ఆలన విభాగంలో పని చేసే ఓ మహిళా డాక్టర్‌ను కళ్యాణ్ చక్రవర్తి కొన్ని రోజులుగా వేధింపులకు గురి చేస్తున్నాడు. దీనిపై సదరు మహిళ గతంలోనే డీఎంహెచ్‌ఓకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతో ఈ నెల 28న సూర్యాపేట పట్టణ పోలీస్‌స్టేషన్‌లో కేసు పెట్టింది. విచారణ చేపట్టిన పోలీసులు డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తిపై కేసు నమోదు చేసి ఎఫ్ఐఆర్ చేశారు. కేసు నమోదైన నాటి నుంచి సదరు వైద్యాధికారి అందుబాటులో లేకపోవడంతో శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే గురువారం జిల్లా కలెక్టర్, డీఎంహెచ్‌ఓకు సూచించారు. డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి కోసం గాలింపులు చేపట్టినట్లు సూర్యాపేట పట్టణ సీఐ రాజశేఖర్ తెలిపారు.

మహిళా సంఘాల ఆర్థిక బలోపేతమే ప్రభుత్వ లక్ష్యం

- రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్‌కుమార్ సుల్తానియా

మహిళా సంఘాల సభ్యులు కుట్టిన యూనిఫామ్‌ను పరిశీలిస్తున్న సందీప్‌కుమార్ సుల్తానియా, కలెక్టర్ వెంకట్రావ్

ఆత్మకూర్.ఎస్, మే 30 : మహిళా సంఘాల ఆర్థిక బలోపేతానికి ప్రభుత్వం కట్టుబడి ఉన్నదని, ఆ దిశగా మహిళా సంఘాలకు మెరుగైన శిక్షణ అందిస్తున్నామని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్‌కుమార్ సుల్తానియా అన్నారు. మండలంలోని మహిళా స్వశక్తి కుట్టు కేంద్రాన్ని కలెక్టర్ ఎస్.వెంకట్రావు, అదనపు కలెక్టర్ సీహెచ్.ప్రియాంకతో కలిసి గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న ప్రతి విద్యార్థికి యూనిఫాం అందించే లక్ష్యంతో రాష్ట్రంలో 70లక్షల జతల దుస్తులు కుట్టిచ్చే బాధ్యతలను మహిళా సంఘాలకు అప్పగించామన్నారు. అన్ని జిల్లాల్లో మహిళా స్వశక్తి కుట్టు కేంద్రాల ద్వారా దుస్తులను నాణ్యతతో సిద్ధం చేస్తున్నారని తెలిపారు. గతంలో దుస్తుల స్టిచింగ్ ప్రైవేట్ సంస్థలకు ఇవ్వడం జరిగిందన్నారు. సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించే కుట్టు కేంద్రాల్లో ఒక్కో మహిళ రోజుకు ఏడు జతలు అందిస్తున్నారని తెలిపారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని, ప్రభుత్వ పరంగా మంచి భవిష్యత్ ఉంటుందని అన్నారు. ఇప్పటికే అమ్మ ఆదర్శ పాఠశాలల్లో మహిళా కమిటీలు చేపట్టామని, త్వరలో మహిళా పాలసీ చేపట్టనున్నామని తెలిపారు. ఇకపై ప్రతి పనిలో మహిళా సంఘాలకు చేయూత కల్పించనున్నట్లు పేర్కొన్నారు. హైదరాబాద్ వంటి నగరాల్లో మహిళలకు మెరుగైన శిక్షణ ఇచ్చి రెడీమేడ్ దుస్తుల్లో చేయూత కల్పించడం జరుగుతుందన్నారు. అనంతరం కలెక్టర్ వెంకట్రావ్ మాట్లాడుతూ జిల్లాలో 23 మండలాల్లోని 783 ప్రభుత్వ పాఠశాలల్లో 43,245 మంది విద్యార్థులకు గానూ 62 ప్రాంతాల్లో 721 మహిళా సంఘాల సభ్యులతో ఇప్పటి వరకు 31,940 మంది విద్యార్థులకు దుస్తులు సిద్ధం చేశామన్నారు. మిగిలినవి నిర్దేశించిన సమయంలోపు అందిస్తామని చెప్పారు. పాఠశాలలు పునఃప్రారంభం నుంచే విద్యార్థులు నూతన దుస్తులు ధరించి వచ్చేలా అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు సూచనలు జారీ చేశామని తెలిపారు.డీఆర్‌డీఓ మధుసూదన్‌రాజు, సీఈఓ అప్పారావు, డీఈఓ అశోక్ పాల్గొన్నారు.

తిరుమలగిరి తాసీల్దార్ కార్యాలయం

తిరుమలగిరి తాసీల్దార్ కార్యాలయంలో నీళ్ల కరువు

- 20 రోజులుగా అధికారులు, సిబ్బంది అవస్థలు

తిరుమలగిరి, మే 30 : తిరుమలగిరి తాసీల్దార్ కార్యాలయంలో ఇరవై రోజుల నుంచి నీళ్లు లేక అధికారులు, సిబ్బంది అవస్థలు పడుతున్నారు. అధికారులకే నీళ్లు లేక ఇబ్బందులు పడితే ఇక మామూలు ప్రజలను ఎవరు పట్టించుకుంటారని స్థానికులు వాపోతున్నారు. వలిగొండ నుంచి వయా తిరుమలగిరి తొర్రూర్ వరకు జాతీయ రహదారి పనులు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో సర్వీస్ రోడ్ పనుల కోసం తవ్వగా తాసీల్దార్ కార్యాలయంలోకి వచ్చే నీటి పైప్‌లైన్ పగిలిపోయింది. మరమ్మతులు చేయాల్సిన ఆర్‌అండ్‌బీ అధికారులు పట్టించుకోకపోవడంతో నీటి సమస్య తలెత్తింది.

ఈ విషయమై డిప్యూటీ తాసీల్దార్‌ను వివరణ కోరగా పైపులు మరమ్మతులు చేయకపోవడంతో కార్యాలయంలో నీళ్లు లేక ఇబ్బందులు పడుతున్న విషయం వాస్తవమే అన్నారు.

నిరుపయోగంగా యోగా కేంద్రం

- వినియోగంలోకి తేవాలని ప్రజల విన్నపం

భూదాన్‌పోచంపల్లిలో నిర్మాణం పూర్తయిన యోగా కేంద్రం

భూదాన్‌పోచంపల్లి, మే 30 : పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలో నిర్మించిన యోగా కేంద్రం నిరుపయోగంగా మారింది. నేషనల్ ఆయుష్ మిషన్ ద్వారా జిల్లాకు తొలి విడుతలో 12 యోగా కేంద్రాలను(ఆరోగ్య స్వస్థత కేంద్రాలు) గతేడాది మంజూరు చేసింది. జిల్లాలో పోచంపల్లి, చౌటుప్పల్, ఆత్మకూరు, బొల్లేపల్లి, కొలనుపాక, రాజాపేట, చిన్నకందుకూరు, రామన్నపేట, సంస్థాన్‌నారాయణపురం, సర్వేల్, రాయగిరి ప్రాంతాల్లో నిర్మించారు. ప్రభుత్వ ఆస్పత్రులు, ఉప కేంద్రాలకు అనుసంధానంగా వీటిని నిర్మించారు. ఇక్కడ యోగాసనాలతోపాటు ఆరోగ్య సూత్రాలను వివరించనున్నారు. సాధారణ వ్యక్తులతోపాటు ఆస్పత్రికి వచ్చే గర్భిణులకు సాధారణ కాన్పు జరిగేలా అవసరమైన ఆసనాలు నేర్పిస్తారు. ప్రస్తుత జీవన విధానంలో చాలామంది ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇవ్వడం లేదు. శారీరక శ్రమకు దూరమవుతున్నారు. దాంతో రక్తపోటు, మధుమేహం వంటి సమస్యలతో మరింత ఒత